క్లుప్తంగా

నేడు మే డే ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : మే డేను పురస్కరించుకుని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తెలుగుగంగ కార్యాలయం నుంచి అంగడివీధి మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ, అనంతరం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్‌బాషలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఈశ్వరయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్ హాజరవుతారన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ప్రజాస్వామిక విలువల కోసం రాజ్యాంగ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలన్నారు.

ఫాతిమా కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలో ఉన్న ఫాతిమా మెడికల్ కాలేజీ పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, అందుకు నిదర్శనం నిన్న వైద్యం వికటించి మహిళా మృతి చెందడమేనని విద్యార్థి యువజన సంఘాల నాయకులు అంకన్న , శంకర్, సుబ్బరాయుడు, జయవర్ధన్ అన్నారు. ఈ ఘటన వ్యవహారంపై జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆ మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఫాతిమా కళాశాల ప్రారంభం నుంచే పలు ఆరోపణలు ఎదుర్కొంటోందన్నారు. వీటన్నింటిపైన పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాయకుల నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం వామపక్ష నాయకులు తలపెట్టిన ప్రచార భేరిని అడ్డుకున్న పోలీసుల వైఖరిని నిరసిస్తూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అఖిలపక్ష పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు వెంకట శివ, రామ్మోహన్, సత్తార్, రమణయ్య, మల్లిఖార్జున పాల్గొన్నారు.

శివానాయక్‌కు అంబేడ్కర్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న శివానాయక్

కడప రూరల్ : కడప నగరానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డును అందుకున్నారు. ఆదివారం విశాఖ పట్టణంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ జిల్లా కోర్టు జడ్జి సూర్య భాస్కరం, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ మొదటి చైర్మన్ డాక్టర్‌ప్రసాద్ మారెళ్ల, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు ఈ అవార్డును శివనాయక్‌కు ప్రదానం చేశారు. శివానాయక్ 12 ఏళ్లుగా వైద్య రంగంతోపాటు గిరిజన జాతి సంక్షేమానికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సేవ లకు గుర్తింపుగా శివానాయక్‌కు ఈ అవార్డు లభించింది.

శిల్పారామంలో సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నృత్య గురువు విజయశాంతి ఆధ్వర్యంలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు.

అన్నదానం



బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా ఆదివారం దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గంగిరెడ్డిపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె లక్ష్మిరెడ్డి, సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.చంద్రఓబుళరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా , తదితరులు

కడప కార్పొరేషన్: మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో మెప్మా, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, లైవ్‌లీహుడ్ మిషన్ సహకారంతో ఎస్ఎస్ సొల్యూషన్స్ ట్రైనింగ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లోనేగాక, ప్రతి రంగంలోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతోనే ఇస్తున్నారన్నారు. మహిళలు స్వయంగా అభివృద్ధి చెందడానికి వారికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ సొల్యూషన్స్ ద్వారా 52 మంది శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సర్టిఫికెట్లు పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి, వారికి స్వయం ఉపాధి కల్పించాలని, కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి మెరుగైన ఉద్యోగాలు కల్పించాలని మంత్రి మెప్మా అధికారులకు సూచించారు.

మెప్మా ఎండీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, బ్యూటీషియన్ కిట్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ ఆదినారాయణ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డి. సురేష్ రెడ్డి, డీపీఎం టి. నాగరాజు, ఎస్ఎస్ సొల్యూషన్స్ ఎండీ బి. శృతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ విభాగంలో స్త్రీ, పురుషులకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. దాదాపు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, లాంగ్‌జంప్, షార్ట్‌ఫుట్, విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనపరచిన వారు ఈ నెల 5న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. పోటీలను వ్యాయామ అధ్యాపకులు రాఘవేంద్ర, నాగేశ్వరరావు, షఫీ, నాయక్, రవి, శంకర్, ఆర్గనైజర్ అహమద్‌బాషా తదితరులు పర్యవేక్షించారు.

భువనగిరి నారసింహుడికి బ్రహ్మోత్సవ శోభ

– 3 నుంచి ఉత్సవాలు ప్రారంభం
– 5న ఘనంగా నిర్వహించనున్న కల్యాణం

రాజంపేట రూరల్ : భువనగిరి శ్రీలక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను 3వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్నాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న భువనగిరి శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో భక్తులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఐదురోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో 6వ తేదీన నిర్వహించే కల్యాణం విశిష్టమైనది. జిల్లాలో ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు అందజేసే ఏకైక నరసింహస్వామి ఆలయంగా కీర్తంపబడింది. ప్రతి సంవత్సరం స్వామివారికి భువనగిరిపల్లెలోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి కొండమీదికి మేళతాళాలతో బాజా భజంత్రీల నడుమ ముత్యాల తలంబ్రాలను తీసుకువస్తారు. ఈ వేడుక తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా భక్తులు వస్తారు.

సంగీత, సాహిత్య కళామూర్తి చిన్నలక్ష్మిసుబ్బన్న



చిన్న లక్ష్మికళావతిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన చిన్న లక్ష్మిసుబ్బన్న సంగీత, సాహిత్య కళామూర్తిగా పేరుగాంచారని విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ చిన్న లక్ష్మికళావతి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్ శాస్త్రి మందిరంలో 119వ సదస్సు నిర్వహించారు. ఇందులోభాగంగా చిన్న లక్ష్మిసుబ్బన్న జీవితం–సాహిత్యం అనే అంశంపై ఆయన కుమార్తె, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ చిన్న కళావతి ప్రసంగించారు. తొలుత ఆమె తన తండ్రి జీవిత విశేషాలను వివరించారు. కమలాపురానికి చెందిన తమ తండ్రి తొలుత రెవెన్యూశాఖలో, అనంతరం అగ్నిమాపకశాఖలో పనిచేశారన్నారు. బాల్యం నుంచి ఆయనకు పద్య రచనపై ఇష్టం పెరిగిందని, 8, 9 తరగతుల వయస్సులోనే పద్యం రాసే పట్టు సంపాదించి పద్యకావ్యాలు రాశారన్నారు. 2500 కంద పద్యాలతో శ్రీ చిన్నలక్ష్మి కంద రామాయణం గ్రంథాన్ని వెలువరించారన్నారు. ఇంకా ఆయన రాసిన కావ్యాలను పేరుపేరున తెలిపారు. చిన్న సుబ్బన్నకు సంగీతంలో కూడా ప్రావీణ్యం ఉండడంతో హరికథలు చెప్పేవారన్నారు. స్వయంగా చాలా హరికథలను రచించి గానం చేసేవారన్నారు. ఆకాశవాణిలోకూడా ఆయన ఎన్నో రచనలు ప్రసారం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

1998 డీఎస్సీలో మిగిలిన వారికి అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 580 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులు ఉండగా కేవలం 172 మందికి మాత్రమే అవకాశం కల్పించారని మిగిలిన వారికి కూడా అవకాశం కల్పించాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కోరారు. ఈ విషయమై ఆదివారం కడపకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర చైర్మెన్ కాకర్ల వెంకటరామిరెడ్డిని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో 1998 డీఎస్సీ అభ్యర్థులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికి న్యాయం చేస్తానని కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 1998 డీఎస్సీ అభ్యర్థులు చంద్రశేఖర్, బాలాజీ, అక్బర్, జోసెఫ్, మల్లికార్జున, సురేష్, చంద్ర, వినయ్, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన తాజా షెడ్యూల్‌ను విడుదల చేసి వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీను పూర్తి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సివిప్రసాద్‌లు డిమాండ్ చేశారు. బదిలీలకు ప్రత్యేక కోడ్ తీసుకవచ్చి ప్రతి వేసవిలో బదిలీలు జరిగేటట్లు స్టాండర్డ్ షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. కోర్టులో ఉన్న బదిలీల సమస్యల్ని కూడా పరిశీలించి కొత్త మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. మార్గదర్శకాలు తయారు చేసే ముందు డ్రాఫ్టుకాపీని ఉపాధ్యాయ సంఘాల ముందు ఉంచి చర్చించాలని కోరారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు, వీఎన్‌పల్లె మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుమామణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎన్‌పల్లె మండలం, అంకిరెడ్డిపల్లె కార్యకర్త పోస్టు ఎస్‌టీ కేటగిరికి, ఏ.ఓబాయపల్లె హెల్పర్ ఓసీఓహెచ్‌కు, ఉరుటూరు–1 హెల్పర్ బీసీ–సీకి కేటాయించారు. వల్లూరు మండలంలో చిన్నపుత్త హెల్పర్ పోస్టు ఓసీకి, కేబీజే నగర్ హెల్పర్ పోస్టు ఎస్సీకి కేటాయించామన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె అందులో తెలిపారు. వివాహం అయి స్థానికంగా ఉండే మహిళలు దరఖాస్తుతో పాటు విద్యార్హత, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం జతచేసి మే 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 9వ తేదీన కడప ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు ప్రాజెక్ట్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

అంతరాలు తొలగించేందుకు కృషి

– జై భారత్ ఎస్సీ పోరాట వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు తాడవరం వంశీ



మాట్లాడుతున్న జై భారత్ ఎస్సీ పోరాట వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు తాడవరం వంశీ

కడప కార్పొరేషన్: సమాజంలో వేళ్లూనుకొనిపోయిన అంతరాలను తొలగించేందుకు జై భారత్ ఎస్సీ పోరాట వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు తాడవరం వంశీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి గురవయ్యలు సంయుక్తంగా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శంకరాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రి భవనంలో జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ జాతీయ వాదానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జై భారత్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల ఐక్యత, అభ్యున్నతి కోసం జై భారత్ నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. అనంతరం జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికలకు కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ పోరాట వేదిక అధ్యక్షుడిగా ఆర్. ఓబయ్య, ప్రధాన కార్యదర్శిగా రవి, బీసీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షురాలిగా రజియా బేగం, ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేష్, ఎస్టీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎం. శోభానాయక్, ప్రధాన కార్యదర్శిగా బి. కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. భక్తులు విందుభోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలి



ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధతో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి రత్నకుమారి

కడప కార్పొరేషన్: జిల్లాలో మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. సుధ పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి రత్న కుమారి వారిని మర్యాదపూర్వకంగా కలిసి కడప, నెల్లూరు, తిరుపతి జోన్ల పరిధిలో మహిళా కమిటీలు నియమించేందుకు సహకరించాలని విన్నవించారు. దీనిపై వారు స్పందిస్తూ మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తోందని, వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకుపోయి మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలన్నారు. తద్వారా 2024లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆమె ప్రొద్దుటూరుకు వెళ్లి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని కలిశారు.

బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం: మండలంలోని దిరసవంచ గ్రామంలోని లక్ష్మి చెన్నకేశవ స్వామి 19వ సప్తహామహోత్సవాల్లో భాగంగా ఆదివారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ప్రారంభించారు.

ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ. 60 వేలను జెడ్పీటీసీ గోవిందరెడ్డి, రెండవ బహుమతి రూ. 30,016 ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మూడవ బహుమతి రూ. 20,016 సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, నాల్గువ బహుమతి రూ. 10,016 బిజివేముల మోహన్‌రెడ్డి, ఐదవ బహుమతి రూ. 5,016 కొండా వెంకటరామిరెడ్డి అందించారు. మొదటి బహుమతి కమలాపురం నియోజకవర్గం జంగంపల్లెకు చెందిన ఎడ్లకు, రెండవ బహుమతి గోపవరం ఎడ్లకు, మూడవ బహుమతి వేముల ఎడ్లకు, నాల్గువ బహుమతి ప్రొద్దుటూరు ఎద్దు సాధిపంచినట్లు తెలిపారు.

త్వరలో ఎస్సీ విభాగం కమిటీ ఎన్నిక



మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సత్కరిస్తున్న వినోద్‌కుమార్, తదితరులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం పూర్తి స్థాయి జిల్లా కమిటీని జిల్లాలోని ఎమ్మెల్యేల సహకారంతో పూర్తి చేస్తామని ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డా. సుధీర్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలను కలిసి ఎస్సీ విభాగం నియోజకవర్గ, మండల కమిటీలు వేసేందుకు సహకరించాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యేలంతా సానుకూలంగా స్పందించినట్లు వినోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చైతన్య, శ్యాంసన్, మనోజ్, జ్యోతి పాల్గొన్నారు.

వాసవాంబా.. నమోస్తుతే..



క్షీర కలశాలను తీసుకు వస్తున్న కన్యకలు

కడప కల్చరల్ : శ్రీ వాసవీ కన్యకాంబ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవాంబ దీక్ష బూనిన 102 మంది కన్యకలు క్షీర కలశాలు ధరించి శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద నుంచి ఆర్యవైశ్య ప్రముఖుల మార్గదర్శనంలో మంగళ వాయిద్యాల మధ్య స్థానిక వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కన్యకలతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ ఊరేగింపులో పాల్గొని వాసవాంబను స్తుతిస్తూ నినాదాలు చేశారు. భక్తిగీతాలు ఆలపిస్తూ సాగారు. ఆలయానికి చేరుకున్న అనంతరం ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వ్రత దీక్షలో ఉన్న కన్యకలు ఊరేగింపుగా తెచ్చిన కలశాలలోని క్షీరంతో అమ్మవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేష అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వాసవాంబ ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పేరిట వాసవీ హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. రాత్రి అలంకరించిన పూల పల్లకీలో అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం, మహిళా విభాగం ప్రతినిధులు, సంఘాల పెద్దలు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

మే డే శుభాకాంక్షలతో..
సమ్మర్ క్యాంపు - May - 1st నుండి
శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ | నవోదయ సైనిక్
4th - 9th క్లాస్ మ్యాథ్స్, ఇంగ్లీషు, సైన్స్
రాజారెడ్డి వీధి, కడప. సెల్: 9390921596













